## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ కార్యాలయాల ప్రారంభం



47వ డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆనం జయకుమార్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 47వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిద్దిక్, 48వ డివిజన్‌లో కార్పొరేటర్ రామకృష్ణ నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాలను ఆ పార్టీ సీనియర్ నేత ఆనం జయకుమార్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌లను గెలిపించేలా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 47, 48 డివిజన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సంగం : మండలంలోని దువ్వూరు వద్ద నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని బైక్ ఢీకొని ఇరువురు తీవ్రంగా గాయపడిన ఘటన నెల్లూరు- ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి ఎఫ్‌జెడ్ బైక్‌లో సంగం వైపు నుంచి నెల్లూరుకు వెళ్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నాగార్జునరెడ్డి క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో నెల్లూరు వైద్యశాలకు తరలించారు.

### వదంతులు నమ్మొద్దు

• ఆర్డీఓ మధులత



ఆత్మకూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందని, దీనిపై వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదని ఆత్మకూరు ఎన్నికల ఆర్వో, ఆర్డీఓ కె.మధులత అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సీఐ రవినాయక్‌తో కలిసి శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో హోమ్ ఓటింగ్ కోసం నమోదు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దనే ఓటింగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. మైక్రో అబ్జర్వర్, ఒక అసిస్టెంట్, ఎన్నికల సిబ్బంది ఈ ప్రక్రియ చేస్తున్నట్లు తెలియజేశారు. దీనిని వీడియో షూట్ కూడా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగవని, వదంతులు నమ్మవద్దని కోరారు.

### ఎన్నికల శిక్షణా తరగతుల పరిశీలన

ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో పీఓ, ఏపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసిన్హా శుక్రవారం పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. అనంతరం బీసీ బాలికల వసతి గృహంలో జరుగుతున్న ఈవీఎంల కండీషనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్వో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఉదయగిరి ఆర్వో రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెహ్రూబాబు, తదితరులు ఉన్నారు.

### పబ్బులేటిపల్లిలో ఆరోగ్య సురక్ష క్యాంపు

సీతారామపురం: మండలంలోని పబ్బులేటిపల్లిలో ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్య సిబ్బంది 277 మందికి బీపీ, షుగర్, కంటి, గళ్ల, తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ వైద్యశిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఆరోగ్యసురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు స్వప్నారెడ్డి, షబాన, అన్వేష్, స్థానిక వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

వరికుంటపాడు: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గువదగట్ల వెంకటలక్ష్మమ్మ సూచించారు. మండల సర్వసభ్య సమావేశాన్ని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని చేతిపంపులు మరమ్మతులకు గురై ఉంటే గుర్తించి బాగుచేయాలన్నారు. మండలాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ వారికి జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. అనంతరం శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటకృష్ణకుమారి, వైస్ ఎంపీపీ చంచల మధు, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీని వీడి సంక్షేమం వైపు



పార్టీలో చేరిన సీతారామపురం నాయకులతో విజయసాయిరెడ్డి



పార్టీలో చేరిన 54వ డివిజన్ నేతలతో విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులైన ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి తెలిపారు. చేజర్ల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీతారామపురం మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నెల్లూరులోని విజయసాయిరెడ్డి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి విజయసాయిరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే నెల్లూరు సిటీ నియోజకవర్గం 51వ డివిజన్‌లో టీడీపీ, వామపక్షాలకు చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

## ప్రజల హృదయాల్లో వైఎస్సార్‌సీపీకి సుస్థిరస్థానం



ఆదాలకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న హిమబిందు

నెల్లూరు సిటీ: సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీ ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకుందని ఆదాల హిమబిందు అన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ నగరంలోని 32వ డివిజన్‌లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, గత 9 నెలలుగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.150 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై రూరల్ నియోజకవర్గ ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తితో ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో పేదల పక్షంగా ఉందని తెలిపారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీసునంద, పాశెం శ్రీనివాస్, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, నాయకులు ఉదయగిరి నరసింహులుగౌడ్, స్వర్ణజీవన్ ప్రసాద్, పాలకీర్తి రవికుమార్, ఎం.శ్రీనివాసులు, రెహమాన్, అజీజ్, పెంచలమ్మ, రియాజ్, ముణిఫర్, సర్దార్, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గం 25వ డివిజన్‌లోని బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మినీబైపాస్ రోడ్డులోని ఆదాల కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దేపూడి రవీంద్ర ఆధ్వర్యంలో నావూరు హరిబాబు, బండ్ల నరసింహులు, షేక్ నజీర్‌బాషా తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచితస్థానం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, 25వ డివిజన్ పరిశీలకుడు కోటేశ్వరరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి నవాబ్‌జాన్, జేసీఎస్ కన్వీనర్ ధారా వంశీ తదితరులు పాల్గొన్నారు.

**పెనుబర్తి గ్రామస్తుల చేరిక**

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని పెనుబర్తి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదాల శుక్రవారం పెనుబర్తి గ్రామంలోకి ప్రవేశించగా గ్రామానికి చెందిన పుచ్చలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, పులిగొండ్ల వెంకటేశాయ, గూడూరు సుధాకర్, కరిముల్లా, షబ్‌జాన్, గులాం, చిట్టేటి శ్రీధర్‌రెడ్డి, అలగర కిషోర్, పాటూరు సన్నీ, చింతల నిఖిల్, తోనేటి పవన్ వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## ఆంక్షలతో ప్రజలకు ఇబ్బందులు



కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద బాణసంచా పేలుళ్లు



బారికేడ్లతో మూసివేసిన రహదారి

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల ప్రచారంలో భాగంగా నెల్లూరులో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటించిన నేపథ్యంలో ఆంక్షలతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం 6.15 గంటలకు కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద నుంచి నర్తకి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించాల్సి ఉండడంతో మధ్యాహ్నం నుంచే ఆ వైపుగా రాకపోకలు నిలిపివేశారు. మరో వైపు ఆర్టీసీ వైపు నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ వైపు వచ్చే రహదారిలో రాకపోకలు అనుమతించినప్పటికీ ప్రజలు గుంపులు గుంపులుగా రోడ్లపైనే ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా రాకపోకలు నిలిపివేయడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు.

**నడిరోడ్డుపైనే బాణసంచా**

ర్యాలీ సందర్భంగా నడిరోడ్డుపైనే బాణసంచా భారీగా కాల్చగా అవి ర్యాలీకి విచ్చేసిన వారిపై పడడంతో పరుగులు తీశారు. ప్రధానంగా కేవీఆర్ పెట్రోల్ బంక్ సెంటర్, గాంధీబొమ్మ పెట్రోల్ బంక్‌కు సమీపంలో బాణసంచా పెద్ద ఎత్తున కాల్చారు. నిప్పురవ్వలు ఎగిరి పెట్రోల్ బంక్ వద్ద పడడంతో అక్కడున్న సిబ్బంది వాటిని వెంటనే ఆర్పివేశారు. పెట్రోల్ బంక్‌ల వద్ద బాణసంచా కాల్చరాదని నేతలకు తెలియక పోయినా, అక్కడున్న పోలీసు అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

## మాజీ రాష్ట్రపతికి ఘన నివాళి



జాకీర్‌హుస్సేన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయనకు పలువురు ఘన నివాళులర్పించారు. నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఉన్న జాకీర్‌హుస్సేన్ కాంస్య విగ్రహానికి ఆవాజ్ కమిటీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి రషీద్, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్‌రావు, రియాజ్, షబీర్, రహంతుల్లా, కరిముల్లా, మొహియుద్దీన్, విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

మనుబోలు : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మడమనూరు, వీరంపల్లిలో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు స్థానికులు సహకరించాలని కోరారు. ఆయన వెంట మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ ఉన్నారు.

### విధుల్లో జాగ్రత్తగా ఉండాలి

• జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



మాట్లాడుతున్న సేతు మాధవన్

కోవూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు తమ విధుల్లో జాగ్రత్తగా ఉండాలని జాయింట్ కలెక్టర్, కోవూరు రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్ పేర్కొన్నారు. కోవూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు. జేసీ వెంట జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

### తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



పొదలకూరు : క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్‌ను పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ ఆర్.రాంబాబు, ఎస్సై రామకృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచలనర్సయ్య, సభ్యులు కొండయ్య, కృష్ణయ్య, సరోజనమ్మ, షకీలా, శేషాద్రి, పద్మమ్మ, నరసారెడ్డి, భాగ్యమ్మ, సుధాకర్ ఆచారి, పెంచలయ్య, కిరణ్, హరి, కిశోర్ పాల్గొన్నారు.

### అనంతసాగరంలో హోమ్ ఓటింగ్



ఓటింగ్ సామగ్రిని తీసుకొస్తున్న అధికారులు

సోమశిల : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు నిర్వహించే హోమ్ ఓటింగ్‌ను అనంతసాగరం మండలంలోని బొమ్మవరం అగ్రహారం, సంజీవనగరం, అనంతసాగరం, ఇనగలూరు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. మండలంలో మొత్తం 49 ఓట్లు ఉండగా 13 ఓట్లు పూర్తి చేశామని, ఒకరు డోర్ లాక్ చేసి ఉండగా మిగిలిన ఓట్లు రెండు రోజుల్లో పూర్తి చేస్తామని వివరించారు.

# ఫ్యాన్ గుర్తుపై ఓటేద్దాం

• మేయర్ స్రవంతి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ స్రవంతి తదితరులు

నెల్లూరు(బారకాసు): ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని నగర మేయర్ పొట్లూరి స్రవంతి ప్రజలను కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్, రామచంద్రారెడ్డినగర్(తోట) ప్రాంతంలో కార్పొరేటర్ కూకాటి ప్రసాద్, 29వ డివిజన్ ఇన్‌చార్జి సాయిరెడ్డిలతో కలిసి శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడప గడపకు సంక్షేమ పథకాలను అందించిందని తెలిపారు. చంద్రబాబు చెప్పే అబద్ధాలు, హామీలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. భూటకపు హామీలిచ్చి అమలు చేయలేని చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని.. ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై వేయాలని మేయర్ అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, హరిబాబు, సూరి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

• నెల్లూరు సిటీ ఆర్వో వికాస్‌మర్మత్



మాట్లాడుతున్న ఆర్ఓ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): 2024 సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా పోలింగ్ అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ సూచించారు. శుక్రవారం నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో పీఓలు, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ తరగతులను ఆర్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈవీఎంలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ముందుగానే అన్ని సందేహాలు నివృత్తి చేసుకుని పోలింగ్‌కు సిద్ధం కావాలని సూచించారు. ఏమైనా సందేహాలు, సమస్యలు ఉంటే ముందుగానే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ లవన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు వీఆర్ కళాశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను డీఆర్ఓ లవన్న పరిశీలించారు.

## వైఎస్సార్‌సీపీ గెలుపుతో మరింత అభివృద్ధి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కర్తం ప్రతాప్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ గెలుపుతో నెల్లూరు మరింత అభివృద్ధి చెందుతుందని 14వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్తం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 14వ డివిజన్ పద్మావతినగర్, వేపదొరువు తదితర ప్రాంతాల్లో ఆయన శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్‌ను ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ఆదాలను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం



ఎన్నికల ప్రచారంలో 41వ డివిజన్ నాయకులు

నెల్లూరు సిటీ: ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని వైఎస్సార్‌సీపీ 41వ డివిజన్ కార్పొరేటర్ కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. 41వ డివిజన్‌లోని మహేశ్వరినగర్, సాయినగర్, ఇరగాళమ్మ సంఘం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆదాల గెలుపు కోసం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి కె.బాబ్జీ, నాయకులు శ్రీనివాసులు, అద్దంకి కృష్ణ, కేపీఎస్ ప్రసాద్, ఏడుకొండలు, చిన్నా సావిత్రమ్మ, కామాక్షమ్మ, సుమలత, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## భారీ మెజార్టీతో విజయం తథ్యం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నేహారెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అన్నారు. నగరంలోని 8వ డివిజన్‌లో కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షీదేవి, ఆ డివిజన్ ఇన్‌చార్జి దొంతాలి రఘు వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా చరిత్రలో తొలిసారిగా నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో పొందుపరచిన విధంగా విజయసాయిరెడ్డి నెల్లూరు నగరాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తారన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం సెజ్‌లు, పరిశ్రమలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీని ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని, ఇదంతా జగనన్న అందించిన సుపరిపాలన ఫలితమేనని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నెల్లూరు ఎంపీగా తన తండ్రి విజయసాయిరెడ్డిని, నగర ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రసూల్, రాజేంద్రప్రసాద్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కర్తం జ్యోతి, మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీ వెంకటాచలం హిమబిందు, మాధవివర్మ, బెందాళం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## అభినయ ఆర్ట్స్ దశమ వార్షికోత్సవం రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న రాఘవ, నారాయణరెడ్డి, మురళీమోహన్‌రావు తదితరులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో 'అభినయ ఆర్ట్స్' దశమ వార్షికోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు, దర్శకుడు, నటుడు సీఆర్ రాఘవ తెలిపారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలో దశమ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను శుక్రవారం వివిధ రంగాలకు, సంస్థలకు చెందిన నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఆర్ రాఘవ మాట్లాడుతూ సకల కళల సమాహారం, రమ్యమైన నాటక రంగం కోసం అభినయ ఆర్ట్స్ దశాబ్దకాలంగా ఎన్నో నాటకాలను, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిందన్నారు. తెలుగునాటక రంగంలో ఎంతో సుప్రసిద్ధమైన 'తుపాను' నాటికను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ నటులతో ప్రదర్శిస్తున్నామని తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని సావిత్రీబాయిపూలే, జ్యోతిరావు పూలే సంస్మరణ సభ సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రముఖ కళాకారులతో సంగీత, నృత్య ప్రదర్శనలు, సంగీత విభావరి, నృత్యపోటీలు నిర్వహిస్తున్నామన్నారు.. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేయడంతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను, ప్రతిభావంతులను సత్కరించనున్నట్లు తెలిపారు. మైఖేల్ ఫౌండేషన్ అధినేత తుంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ సంగీత, నృత్య పోటీల్లో పాల్గొనే ఔత్సాహిక కళాకారులు తమ పేర్లు నమోదు కోసం ఎన్వీ రమణయ్యను 96039 74578 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో బుల్లితెర నటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, కేతా సుబ్బారావు, ఎ.జయప్రకాష్, దగ్గుపాటి రాధాకృష్ణ, ఎ.మల్లికార్జున పాల్గొన్నారు.